క్లుప్తంగా

పాడా కార్యాలయంలో నేడు గ్రీవెన్స్

పిఠాపురం: ప్రజా సమస్యల పరిష్కారం కోసం పీజీఆర్ఎస్(గ్రీవెన్స్) కార్యక్రమం సోమవారం నిర్వహిస్తున్నట్టు పిఠాపురం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ(పాడా) పీడీ ఏ.చైత్రవర్షిణి తెలిపారు. పిఠాపురం మున్సిపల్ గెస్ట్ హౌస్ వద్దనున్న పాడా కార్యాలయంలో ఉదయం పది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధిత డివిజనల్, మండల స్థాయి అధికారులు విధిగా హాజరుకావాలని ఆదేశించారు. అర్జీదారులు తమ సమస్యలను వినతుల రూపంలో అందజేసి, సమస్యలు పరిష్కరించుకోవాలని కోరారు.

దరఖాస్తు గడువు పెంపు

సామర్లకోట: వివిధ కార్పొరేషన్ల ద్వారా వెనుకబడిన వారికి రుణాల కోసం సమర్పించే దరఖాస్తుల గడువు ఈ నెల 25 వరకు పెంచినట్టు ఎంపీడీఓ కె.హిమామహేశ్వరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బీసీ, కాపు, బ్రాహ్మణ, రెడ్డి కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీతో కూడిన రుణాల కోసం ఈ నెల 22 గడువు తేదీగా నిర్ణయించారని చెప్పారు. దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం లభించలేదని అనేక మంది ఫిర్యాదుల మేరకు గడువు పెంచారన్నారు. దరఖాస్తుదారులు 21 నుంచి 60 ఏళ్ల మధ్య ఉన్నవారికి అవకాశం కల్పించినట్లు తెలిపారు.

జాతీయ సదస్సులో గౌరీనాయుడుకు సత్కారం


గౌరీనాయుడును సత్కరిస్తున్న అకాడమీ సభ్యులు

పిఠాపురం: ఆంధ్రప్రదేశ్ భాషా సాంస్కృతిక శాఖ, తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ అకాడమీ సంయుక్త నిర్వహణలో రాజమహేంద్రవరం ఆనం రోటరీ సమావేశ మందిరంలో ఆదివారం నిర్వహించిన జాతీయ సదస్సులో రాచకొండ నరసింహ శర్మ సాహితీ సంస్థ ఉపాధ్యక్షుడు, సోమసుందర్ లిటరరీ ట్రస్ట్ కో–ఆర్డినేటర్, రచయిత డాక్టర్ కిలారి గౌరీనాయుడు ఆత్మీయ అతిథిగా పాల్గొన్నారు. బోయి భీమన్న జీవితం–సాహిత్యం అనే అంశంపై ఆయన ప్రత్యేక ప్రసంగం చేసి, పత్ర సమర్పణ చేశారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు గౌరీనాయుడును ఘనంగా సత్కరించారు. ఈ సదస్సులో ఆయన అభ్యుదయ గీతాలను కూడా ఆలపించారు.

కరాటేతో స్వీయ రక్షణ

సామర్లకోట: ప్రతిఒక్కరూ కరాటే నేర్చుకోవడం ద్వారా స్వీయరక్షణకు అవకాశం ఉంటుందని స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి కొల్లబోయిన శ్రీనివాస యాదవ్ అన్నారు. ఆదివారం మండల పరిధిలో అచ్చంపేట కాపు కల్యాణ మంటపంలో కరాటే శిక్షణ జరిగింది. ఈ సందర్భంగా ఇటీవల జరిగిన కరాటే పోటీల్లో బంగారు పతకాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. విజేతలు టి.రమ్యశ్రీ విద్య, బి.ధరహాసిని, ఎస్.గంగాభవాని, పి.గణేష్, ఎ.గంగబాల భార్గవ్, ఎస్.స్వప్నదీపక్‌కు ప్రత్యేక బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో కరాటే కోచ్ జాకీదాస్ పాల్గొన్నారు.

డ్రోన్లతో నిఘా

కాకినాడ క్రైం: కాకినాడ వన్ టౌన్ పరిధిలో ఆదివారం డ్రోన్లతో నిఘా కొనసాగింది. వారాంతంలో తాగుబోతులు, జూదరులు, మాదక ద్రవ్యాలు తీసుకునే వారి ఆగడాలకు ఆస్కారం ఉండడంతో సీఐ నాగదుర్గారావు ఆధ్వర్యంలో డ్రోన్ నిర్వహణ బృందం నిఘా ఏర్పాటు చేసింది. నిర్మానుష్య ప్రదేశాలు, గతంలో నేరాలు ఎక్కువగా చోటు చేసుకున్న ప్రాంతాలే లక్ష్యంగా డ్రోన్ నిఘా కొనసాగింది. అంతకుముందు పోలీస్ స్టేషన్ ఆవరణలో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు.

వేసవి గట్టెక్కేనా..?


సామర్లకోట గోదావరి కాలువలో తగ్గిన నీటిమట్టం


నాగార్జున చెరువులో చేపల వేట కోసం ఉన్న బోట్లు

- గోదావరి కాలువలో తగ్గుతున్న నీటి మట్టం
- ఫిల్టర్‌బెడ్ చెరువు నింపేది ఎప్పుడో!
- ఇంకా కొనసాగుతున్న చేపల వేట

సామర్లకోట: ధవళేశ్వరం నుంచి వస్తున్న సామర్లకోట గోదావరి కాలువలో నీటిమట్టం గణనీయంగా తగ్గిపోయింది. ఏప్రిల్ తొలి వారంలో గోదావరి కాలువను మూసివేసే అవకాశం ఉంది. దాంతో పెద్దాపురం, సామర్లకోట మున్సిపాలిటీల్లోని ఫిల్టర్ చెరువులను నింపాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. ఐదు తూముల వద్ద నుంచి పీబీసీ మీదుగా ఫిల్టర్ చెరువులోకి నీరొస్తుంది. సామర్లకోట ఫిల్టర్ చెరువులోని నీటిని వాడకుండా, బైపాస్ కాలువ ద్వారా వచ్చిన నీటిని ఫిల్టర్ ప్లాంట్‌లోకి మళ్లించడంతో నాగార్జున ఫిల్టర్ చెరువులో నాచు పెరిగి ఆకుపచ్చ రంగులోకి నీరు మారింది. దాంతో ఆ చెరువులో నీటిని పూర్తిగా తొలగించి, కొత్త నీటిని నింపాలని మున్సిపల్ అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు మున్సిపల్ అధికారులు జిల్లా కలెక్టర్ దృష్టికి విషయాన్ని తీసుకెళ్లారు. ఈ చెరువులో చేపలున్నాయని మత్స్యకారులు జిల్లా కలెక్టర్‌కు వివరించారు. వెంటనే చేపల వేట పూర్తి చేసి, నీటిని తొలగించాలని మున్సిపల్ అధికారులకు కలెక్టర్ సూచించారు. దాంతో మార్చి 15 నాటికి చేపల వేటను పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య మత్స్యకార సంఘ నాయకులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో ఆదివారం కూడా చేపల వేట కొనసాగింది. దాంతో చెరువులో ఎప్పుడు నీరు తొలగిస్తారు, కొత్త నీటిని ఎప్పుడు నింపుతారని ప్రజలు చర్చించుకుంటున్నారు.

పూడికతో ప్రధాన సమస్య

సుమారు 45 ఏళ్ల క్రితం, 350 ఎకరాల విస్తీర్ణంలో పబ్లిక్ హెల్త్ ఆధ్వర్యంలో చెరువును ఏర్పాటు చేసి, నాగార్జున ఫ్యాక్టరీకి లీజుకు ఇచ్చారు. ఈ చెరువు నీటిని వినియోగించుకునే హక్కును 2000లో మున్సిపాలిటీకి లభించింది. గోదావరి కాలువ నీటితో ఈ చెరువును నింపుతున్నారు. నీరొచ్చే సమయంలో గోదావరి కాలువలో మట్టి కూడా చేరడంతో, చెరువులో పూడిక పెరిగిపోయింది. చెరువు సామర్థ్యం మూడు మీటర్లు కాగా, మట్టి సుమారు ఒకటిన్నర మీటర్ల వరకు పెరిగిందని చెబుతున్నారు. ఈ చెరువులో నీటిని తొలగించే సమయంలో మట్టిని కూడా పూర్తిగా తొలగిస్తే చెరువు నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గోదావరి కాలువ మూసివేసే నాటికి ఇది సాధ్యమా అనే సందేహాలు కూడా లేకపోలేదు. పూడిక తీసి, చెరువులో మూడు మీటర్ల వరకు నీటిని పూర్తిగా నింపితే వేసవిలో నీటి ఎద్దడి ఉండదనే వాదనలున్నాయి.

చేపల వేట నిలిపి, నీరు నింపాలి



నాగార్జున ఫిల్టరు చెరువులో చేపల వేటను నిలుపుదల చేసి, చెరువులో నీరు పూర్తిగా తొలగించాలి. గోదావరి జలాలతో చెరువును నింపాలి. వేసవి కాలంలో నీటి ఎద్దడి లేకుండా చేయాలి. చెరువులో నీరు తీసే అవకాశం మరోసారి వచ్చే అవకాశం ఉండదు. దీనిని దృష్టిలో పెట్టుకుని, కాస్త ఖర్చయినా పూడిక తీయడం ఉత్తమం. ఇప్పటికే గోదావరి కాలువలో నీటి మట్టం బాగా తగ్గింది.

– కాళ్ల లక్ష్మీనారాయణ, మాజీ కౌన్సిలర్, సామర్లకోట

చెరువు నింపే ఏర్పాట్లు చేస్తున్నాం



నాగార్జున చెరువులో నీటిని పూర్తిగా తొలగించే ఏర్పాట్లు చేస్తున్నాం. చేపల వేట నిలుపుదల చేయాలని మత్స్యకారులకు ఆదేశాలిచ్చాం. గోదావరి కాలువ నీటితో చెరువును నింపుతాం. ప్రస్తుతం చెరువులో పూడిక తీయడం సాధ్యం కాదు. వేసవి కాలంలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటాం. చెరువులో చేపల పెంపకం జరగకుండా చర్యలు చేపడతాం.

– ఎ.శ్రీవిద్య, మున్సిపల్ కమిషనర్, సామర్లకోట

ముద్రా రుణాల మంజూరు తెలియజేయరా?

- విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా తరగతులు నిర్వహించాలి
- విద్య, ఐసీడీఎస్ అధికారుల తీరుపై ప్రజాప్రతినిధుల ఆగ్రహం
- వేసవిలో మంచినీటి ఎద్దడిపై దృష్టి సారించాలన్న ఎంపీపీ
- వాడీవేడిగా పెద్దాపురం మండల పరిషత్ సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సత్యవతి


సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు

పెద్దాపురం: గ్రామాల్లో డ్వాక్రా మహిళలకు ఇస్తున్న ముద్రా రుణాల మంజూరులో వెలుగు, బ్యాంక్ అధికారులు కుమ్మక్కై ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వరా..? కనీసం ఏ గ్రామానికి ఎన్ని ముద్ర రుణాలు, ఎన్ని గ్రూపులకు ఇస్తున్నారో తెలపకుండానే ఆ శాఖ, బ్యాంక్ సిబ్బంది కుమ్మక్కై రుణాల మంజూరులో అవకతవకలు పాల్పడుతున్నారంటూ ప్రజాప్రతినిధులు మండిపడ్డారు. విద్యార్థులు తక్కువగా ఉన్నారంటూ పాఠశాలల విలీనం పేరుతో తరగతుల నిర్వహణపై విద్యా శాఖ అధికారుల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పెద్దాపురం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఆదివారం ఎంపీపీ పెంకే సత్యవతి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా అధికారుల సమీక్షలో విద్యా శాఖ, ఐసీడీఎస్, వెలుగు శాఖలపై ప్రజాప్రతినిధులు ప్రశ్నల వర్షం కురిపించారు. పనితీరు మార్చుకోవాలంటూ ఆయా శాఖల అధికారులపై ధ్వజమెత్తారు. మర్లావ సర్పంచ్ తోట రామకృష్ణ మాట్లాడుతూ, మండలంలోని చాలా గ్రామాల్లో ముద్ర రుణాల మంజూరుపై ఏ ఒక్కరికీ సమగ్ర వివరాలు తెలపకుండా, ప్రభుత్వం మంజూరు చేసే రుణాల్లో డ్వాక్రా యానిమేటర్లు, బ్యాంక్ అధికారులు కుమ్మక్కవుతున్నారన్నారు. కనీసం సర్పంచ్‌లకైనా, పంచాయతీల్లో అయినా వివరాలు వెల్లడించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు ఎక్కువగా ఉన్న సమీప స్కూళ్లకు తరలిస్తామని విద్యా శాఖాధికారుల సొంత నిర్ణయాల వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు.

నిర్మాణం ఎప్పుడు పూర్తిచేస్తారు?

తమ గ్రామంలో అంగన్‌వాడీ భవనం నిర్మాణం చేపట్టి ఏళ్లు గడుస్తున్నాయని, నిర్మాణాన్ని ఎప్పుడు పూర్తి చేస్తారని కట్టమూరు ఎంపీటీసీ నల్లల సూర్యకుమారి నిలదీశారు. గత ప్రభుత్వ హయాంలో లక్షల రూపాయలు మంజూరు చేసి భవన నిర్మాణ పనులు చేపడితే, నేటికీ ఎందుకు పూర్తి చేయలేకపోయారని ప్రశ్నించారు. తిరుపతి సర్పంచ్ మొయిళ్ల కృష్ణమూర్తి మాట్లాడుతూ, గ్రామంలో అనధికార స్థలంలో ఆక్రమణలపై ఫిర్యాదు చేసినా చర్యల్లేవంటూ రెవెన్యూ అధికారులను ప్రశ్నించగా, సంబంధిత ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేశామని, అనధికార స్థలాల్లో ఆక్రమిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ వెంకటలక్ష్మి హెచ్చరించారు.

వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలి

వేసవి దృష్ట్యా అధికారులు గ్రామాల్లో మంచినీటి ఎద్దడి లేకుండా చూడాలని ఎంపీపీ పెంకే సత్యవతి అన్నారు. వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి సేవలందించాలన్నారు. పలు అంశాలపై సభ్యుల ప్రశ్నల వర్షంతో సమావేశం వాడీవేడిగా కొనసాగింది. ఈ సమావేశంలో ఎంపీడీఓ శ్రీలలిత, ఏఓ సంజయ్‌కుమార్, ఏపీఓ సుధీర్, ఐసీడీఎస్ సీడీపీఓ ఉష, ఎంఈఓలు చౌదరి, శర్మ, ఆయా శాఖల అధికారులు, సర్పంచ్‌లు కనపర్తి చీమదొర, కొత్త చక్రరావు, ఒబిలిశెట్టి అబ్బాయి, ఎంపీటీసీలు పోకనాటి నాగలక్ష్మి, రాయి వెంకటేశ్వరరావు, కో–ఆప్షన్ సభ్యురాలు శేష కుమారి తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతోనే గ్రామాల అభివృద్ధి

- సమస్యలపై అధికారులను నిలదీసిన ప్రజాప్రతినిధులు
- పూర్తి స్థాయిలో హాజరు కాని సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు


పారిశుధ్య సమస్యపై నిలదీస్తున్న ఎంపీటీసీ సుభాషిణి. చిత్రంలో ఎంపీపీ సుధ, అధికారులు

కొత్తపల్లి: ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసినపుడే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీపీ కారే సుధ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశానికి సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పూర్తి స్థాయిలో హాజరు కాలేదు. రెవెన్యూ శాఖకు సంబంధించి ఏ ఒక్క అధికారీ హాజరు కాలేదు. ఈ సందర్భంగా గ్రామాల్లోని పలు సమస్యలపై అధికారులను ప్రజాప్రతినిధులు నిలదీశారు. నాగులాపల్లి ఎంపీటీసీ అనిశెట్టి సుభాషిణి మాట్లాడుతూ, గ్రామంలో కొంతకాలంగా పారిశుధ్య కార్మికులు లేకపోవడంతో పారిశుధ్యం క్షీణిస్తోందని చెప్పారు. గతంలో ముగ్గురు పారిశుధ్య కార్మికులు ఉండేవారని, ప్రస్తుతం ఒక్క కార్మికుడు కూడా విధులకు హాజరు కావడం లేదన్నారు. ఎటుచూసినా డ్రైనేజీలు పూడిపోయాయని, రోడ్లపై చెత్త పేరుకుపోయిందని చెప్పారు. గ్రామంలోని రెండు సచివాలయాలకు కనీసం బాత్రూంలు కూడా లేకపోవడంతో అధికారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పాత ఇసుకపల్లి సర్పంచ్ సన్నిబోయిన రిబ్కా మాట్లాడుతూ, పట్టాలిచ్చిన నిరుపేదలకు ఇంటి స్థలం చూపించలేదన్నారు. ఉప్పరగూడెంలో ఉన్నత పాఠశాల, అంగన్‌వాడీ భవనాలకు ప్రహరీలు లేక విద్యార్థులు, చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎంఈఓ వేణుగోపాల్ మాట్లాడుతూ, ప్రభుత్వం పాఠశాలల ఎంపికలో నూతన విధానాన్ని తీసుకువచ్చిందని తెలిపారు. 1 నుంచి 5 తరగతుల పాఠశాలలో 45 మంది విద్యార్థులు దాటితే ఆదర్శ పాఠశాలగా ఎంపిక చేస్తారన్నారు. ఇందులో ఐదుగురు ఉపాధ్యాయులను నియమిస్తారన్నారు. పాఠశాలకు కి.మీ. దూరంలో ఉన్న విద్యార్థులకు ప్రభుత్వం ఆటో రవాణా ఖర్చు ఇస్తుందన్నారు. మండలంలో ఆరు జెడ్పీ పాఠశాలలకు ఉపాధిహామీ పథకం ద్వారా రూ.1.29 కోట్లు మంజూరయ్యాయన్నారు. త్వరలోనే పనులు ప్రారంభిస్తారన్నారు. మత్స్య శాఖాధికారి శివరామకృష్ణ మాట్లాడుతూ, మత్స్యకారులకు వలలు, బోట్ల మరమ్మతులకు 40 శాతం రాయితీని అందిస్తారన్నారు. గతేడాది మత్స్యకార భరోసా ఏప్రిల్‌లో అందే అవకాశాలున్నాయన్నారు. ఏపీఈపీడీసీఎల్ ఏఈ శ్రీనివాస్ మాట్లాడుతూ, గ్రామాల్లో లోఓల్టేజ్ సమస్యను పరిష్కరించేందుకు కేంద్ర ప్రభుత్వం సోలార్ సబ్ స్టేషన్ నిర్మాణానికి చర్యలు చేపట్టిందన్నారు. గ్రామాల్లో స్థలసేకరణకు ప్రజాప్రతినిధులు సహకరించాలన్నారు. ఈఓపీఆర్డీ కర్రి హరి సత్యకృష్ణారెడ్డి మాట్లాడుతూ, గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణపై దృష్టి పెట్టామన్నారు. నాగులాపల్లిలో పారిశుధ్య సమస్యపై ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నామన్నారు. సచివాలయాల్లో బాత్రూంల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ శివరామరాజు మాట్లాడుతూ, గ్రామాల్లో నవోదయ కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. జెడ్పీటీసీ గుబ్బల తులసీకుమార్ మాట్లాడుతూ, వేసవిలో ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం నాణ్యతపై అధికారులు దృష్టి పెట్టాలన్నారు. ఎంపీపీ సుధ మాట్లాడుతూ సర్వసభ్య సమావేశాలకు ప్రజాప్రతినిధులు పూర్తిగా హాజరైతే, సమస్యలపై చర్చించి, పరిష్కరించేందుకు వీలవుతుందన్నారు. వైస్ ఎంపీపీ చెట్టుబత్తిన సురేష్‌కుమార్, ఎంపీడీఓ రవికుమార్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

క్రీడాకారుడు నాగబాబుకు అభినందన


నాగబాబును అభినందిస్తున్న నాయకులు

సామర్లకోట: జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఉద్యోగుల క్రీడల్లో పరుగు పందెంలో అనేక పతకాలు సాధించిన యాతం నాగబాబును బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు అభినందించారు. ఆదివారం సాయంత్రం పట్టణంలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన విశ్వేశ్వరరావుకు నాగబాబును పార్టీ నేత చిన్నయ్యదొర పరిచయం చేశారు. కాకినాడలో వైద్యారోగ్య శాఖలో సబ్ యూనిట్ ఆఫీసర్‌గా పని చేస్తున్న సామర్లకోటకు చెందిన నాగబాబు 2013 నుంచి 2025 వరకు 100, 200, 400, 800, 1500 మీటర్ల పరుగులో 60 జాతీయ పతకాలను సాధించారని తెలుసుకుని విశ్వేశ్వరరావు అభినందించారు.

విద్యార్థులను తీర్చిదిద్దాలి


విజేతలకు బహుమతులు అందజేస్తున్న అతిథులు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దాలని జేఎన్‌టీయూకే ఉప కులపతి (వీసీ) సీఎస్ఆర్‌కే ప్రసాద్ అన్నారు. సివిల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యాన నిర్వహిస్తున్న టెక్‌ఫెస్ట్ సొధ ఆదివారం ముగిసింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రసాద్ మాట్లాడుతూ, ప్రస్తుత సాంకేతిక పోటీ ప్రపంచంలో విద్యార్థులు తమ లక్ష్యాలను సాధించేందుకు ఎన్నో అవకాశాలున్నాయని అన్నారు. వాటిని అందిపుచ్చుకుని కలలు సాకారం చేసుకోవాలని సూచించారు. వికసిత్ భారత్–2047, వికసిత్ ఆంధ్రప్రదేశ్–47 మాదిరిగా వికసిత్ జేఎన్‌టీయూకే–2047కు అనుగుణంగా రోడ్ మ్యాప్ తయారు చేసి ఆదర్శంగా నిలిపేందుకు కృషి చేయాలని అన్నారు. రిటైర్డ్ కల్నల్ ఎంఎస్ ప్రభాకరరావు మాట్లాడుతూ, సాయుధ దళాల అధికారి కావడానికి గల అవకాశాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. త్రివిధ దళాల్లోని వివిధ క్యాడర్లలో పోస్టులు, ఖాళీలు, ఆఫీసర్ లెవెల్ పోస్టులు, ఇండియన్ మిలిటరీ అకాడమీ, డిఫెన్స్ అకాడమీ తదితర అంశాలను వివరించారు. అనంతరం టెక్నికల్ సింపోజియంలో భాగంగా వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సివిల్ విభాగాధిపతి కోటేశ్వరరావు, చీఫ్ ఇంజినీర్ శ్రీనివాసులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

తపాలా ఉద్యోగుల సంఘ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న రాజారావు

బాలాజీచెరువు: ఆలిండియా పోస్టల్ ఎంప్లాయిస్ యూనియన్ కాకినాడ డివిజన్ ఐదో ద్వైవార్షిక సమావేశం ఆదివారం కాకినాడలో జరిగింది. పెన్షనర్లకు దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలపై ఈ సమావేశంలో చర్చించారు. ముఖ్యఅతిథిగా వైజాగ్ రీజియన్ సెంట్రల్ కమిటీ సభ్యుడు రాజారావు హాజరయ్యారు. ఎనిమిదో వేతన కమిషన్ చైర్మన్, కమిటీ సభ్యులను వెంటనే నియమించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ కాకినాడ డివిజన్ అధ్యక్షుడు జీవీ లక్ష్మీనారాయణ, కార్యదర్శి సత్తిరాజు, రంగయ్య, మార్కండేశ్వరరావు, డివిజనల్ కార్యదర్శి తురగా సూర్యారావు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ ఆశయ సాధనకు పోరాడాలి

వర్ధంతి కార్యక్రమాల్లో వక్తల పిలుపు


పిఠాపురంలో భగత్‌సింగ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మండలి సభ్యులు


గొల్లప్రోలులో భగత్‌సింగ్ చిత్రపటానికి జోహార్లు అర్పిస్తున్న నాయకులు


సామర్లకోటలో భగత్‌సింగ్ శ్రద్ధాంజలి ఘటిస్తున్న రైతు కూలీ సంఘ నాయకులు


పెద్దాపురంలో భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాల వేస్తున్న జోస్యుల తదితరులు


పులిమేరులో నివాళులర్పిస్తున్న రైతు కూలీలు


సామర్లకోటలో నిర్వహిస్తున్న రక్తదాన శిబిరం

పిఠాపురం: స్వాతంత్య్ర సమరయోధుడు భగత్‌సింగ్ ఆశయాల అమలుకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు కుంచె అంజిబాబు పిలుపునిచ్చారు. ఆదివారం గొల్లప్రోలు పట్టణ పరిధిలోని జగనన్న కాలనీలో అమరవీరుడు భగత్‌సింగ్ వర్ధంతి నిర్వహించారు. సమాఖ్య జిల్లా నాయకుడు డి.నారాయణమూర్తి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి అంజిబాబు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ స్వాతంత్య్ర పోరాటంలో యువతను మేల్కొలిపి, పోరాటానికి సిద్ధం చేసిన యువ కిశోరం భగత్‌సింగ్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు గొర్ల శివ, వేగిశెట్టి గణేష్, బల్ల సోమరాజు, కేశవరపు రాజు, కె.శ్రీధర్, సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

సహృదయ మిత్ర మండలి ఆధ్వర్యంలో..

పిఠాపురం పట్టణం యానాదుల కాలనీలో ఉన్న భగత్‌సింగ్ విగ్రహానికి పిఠాపురం సహృదయ మిత్ర మండలి ఆధ్వర్యంలో నివాళులర్పించారు. స్వాతంత్య్ర సమరయోధుడు, విప్లవ వీరుడు భగత్‌సింగ్‌ను యావత్ భారతం ఆదర్శంగా తీసుకోవాలని వక్తలు అన్నారు. చిన్న వయసులో భగత్‌సింగ్ దేశం కోసం ప్రాణాలను తృణప్రాయంగా విడిచారని మండలి గౌరవాధ్యక్షుడు అప్పారావు, డాక్టర్ సూర్యనారాయణ చెప్పారు. మండలి అధ్యక్షుడు తోట శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సీహెచ్ సతీష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

నిత్య పోరాటానికి స్ఫూర్తిదాయకుడు

పెద్దాపురం: దాస్య శృంఖలాల నుంచి దేశాన్ని విముక్తి చేయడానికి తమ జీవితాలను తృణప్రాయంగా భావించిన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని, వారిది నిత్యపోరాట స్ఫూర్తి అని సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షుడు జోస్యుల కృష్ణబాబు అన్నారు. భగత్‌సింగ్ వర్ధంతిని పెద్దాపురం చిల్డ్రన్స్ క్లబ్, ప్రజా సంఘాల సంయుక్తాధ్వర్యంలో స్థానిక సువ్వులగుంట వీధి భగత్‌సింగ్ విగ్రహం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా రొంగల అరుణ్ అధ్యక్షతన జరిగిన సభలో కృష్ణబాబు మాట్లాడుతూ, దేశ స్వేచ్ఛా స్వాతంత్య్రాల కోసం పోరాడిన విప్లవ కిశోరాలు షహీద్ భగత్‌సింగ్, రాజ్‌దేవ్, సుఖ్‌దేవ్ అన్నారు. సామాజిక సమస్యలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న యువత వారి జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. పీసీసీ గౌరవాధ్యక్షుడు బుద్ధా శ్రీనివాస్ మాట్లాడుతూ, భగత్‌సింగ్ కలలు నెరవేర్చడానికి యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. తొలుత భగత్‌సింగ్ విగ్రహానికి నివాళులర్పించారు. సీఐటీయూ నాయకులు గడిగట్ల సత్తిబాబు, ప్రజా నాట్య మండలి కళాకారులు పాల్గొన్నారు. మండలంలోని పులిమేరులో రైతుకూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు, వల్లూరి రాజుబాబు ఆధ్వర్యంలో భగత్‌సింగ్ వర్ధంతి నిర్వహించారు. వారు మాట్లాడుతూ, భగత్‌సింగ్ పోరాట స్ఫూర్తి ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమన్నారు. తొలుత ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దేశెట్టి సురేష్, డి.నారాయణమూర్తి, ఏసు, బీడీల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాద రాజకీయాలను వ్యతిరేకించాలి

సామర్లకోట: అనేక మంది అమరవీరులు తమ ప్రాణాలను అర్పించిన దేశంలో మతోన్మాద రాజకీయాలు పేట్రేగిపోతున్నాయని, వాటిని వ్యతిరేకించాలని రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు వల్లూరి రాజబాబు అన్నారు. భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా స్థానికంగా జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఆయన ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ పోరాట దిశగా పయనించాలని పిలుపునిచ్చారు. సంఘ నాయకులు కర్నాకుల రామలింగేశ్వరరావు, డి.నారాయణమూర్తి, దేశెట్టి సురేష్ జాను, అనుష్క, దుర్గభవాని, శాంతి తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదాతలవుతారు

సేవా దృక్పథంతో రక్తదానం చేసేవారు అనేక మందికి ప్రాణదాతలుగా నిలుస్తారని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్ అన్నారు. స్థానిక మెహర్ కాంప్లెక్స్‌లోని భగత్ సింగ్ విజ్ఞాన కేంద్రంలో భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా ఆదివారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. సకాలంలో రక్తం లభించక అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. సభకు విజ్ఞాన కేంద్రం అధ్యక్షుడు చల్లా మహేష్ అధ్యక్షత వహించారు. రోటరీ బ్లడ్ బ్యాంక్ డాక్టర్ కామరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో 45 మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు మామిడి కృష్ణ, నరవ సురేష్‌బాబు, బాలం శ్రీనివాసు, టి.నాగమణి, కరణం గోవిందరాజు, బాలం సత్తిబాబు, తుంపాల శ్రీనివాసు, కరణం ఏడుకొండలు, యువరాజు, బత్తుల బాలాజీ, సీపీఎం జిల్లా కార్యదర్శి కరణం ప్రసాదరావు పాల్గొన్నారు.

కాగడాల ప్రదర్శన


సామర్లకోటలో కాగడాల ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం, సీఐటీయూ నాయకులు

సామర్లకోట: భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా ఆదివారం రాత్రి సీపీఎం, సీఐటీయు పట్టణ శాఖల ఆధ్వర్యంలో భారీ కాగడాల ప్రదర్శన జరిగింది. స్థానిక మెహర్ కాంప్లెక్స్ నుంచి మఠం సెంటర్, స్టేషన్ సెంటర్, రథం సెంటర్, దేవీచౌక్, నీలమ్మ చెరువు, గొల్లగూడెం మీదుగా ర్యాలీ బళ్ల మార్కెట్ సెంటర్‌కు చేరింది. భగత్‌సింగ్‌కు జోహార్లు అర్పిస్తూ ర్యాలీ కొనసాగించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కరణం ప్రసాదరావు, కరణం ఏడుకొండలు, బాలం శ్రీనివాసు, విప్పర్తి కొండలరావు తదితరులు పాల్గొన్నారు.